క్లుప్తంగా

నేడు సీఆర్‌ఆర్ కళాశాలలో మహిళా దినోత్సవం

ఏలూరు(మెట్రో): అంతర్జాతీయ మహిళా దినోత్సవానఇన శనివారం స్థానిక సీఆర్‌ఆర్ డిగ్రీ కాలేజ్ ఆడిటోరియం వద్ద నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశఋారు. సీఆర్‌ఆర్ డిగ్రీ కాలేజ్ ఆడిటోరియంలో మహిళల కోసం పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటలకు మహిళా దినోత్సవం ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, పొదుపు సంఘాల సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను, పొదుపు సంఘాల మహిళలను సత్కరిస్తామని వివరించారు.

తలసేమియా బాధితులకు సాయం



జేసీ ధాత్రిరెడ్డికి డీడీని అందజేస్తున్న హేలాపురి మహిళలు

ఏలూరు(మెట్రో): తలసేనియా బాధితులకు హేలాపురి మహిళలు శుక్రవారం సాయం చేశారు. ఇంటి వద్ద పిండి వంటలు స్వయంగా తయారుచేసి ఆశ్రమ మెడికల్ కాలేజ్ ఆవరణలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా వచ్చిన సొమ్ములకు, మహిళలు సేకరించిన సొమ్మును జత చేసి మొత్తం రూ. 75,008లను తలసేమియా బాధితుల సహాయార్థం జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి డీడీ రూపంలో అందజేశారు.

పరామర్శ



శ్రీనివాసరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ, పార్టీ నాయకులు

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త ఓర వెంకటేశ్వర రావు కుమారుడు శ్రీనివాస రావు శుక్రవారం మరణించాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్ (జేపీ) బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకటేశ్వర రావును పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నేరుసు చిరంజీవి, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయ నిర్మల, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనపనూరి జగదీష్, పార్టీ సీనియర్ నాయకులు గంట రాజేశ్వర రావు తదితరులు ఉన్నారు.

మురుగు సమస్య తీర్చేదెవరు?

- 24వ డివిజన్‌లో డ్రెయినేజీ సమస్య
- దోమలు, పందులతో అవస్థలు
- పట్టించుకోవడం లేదని అధికారులపై ప్రజల ఆగ్రహం



24 డివిజన్ పరిధిలో ఇంటి ముందు కదలకుండా పేరుకుపోయిన మురుగునీరు



రెడ్డమ్మ స్ట్రీట్‌లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పేరుకుపోయిన మురుగు

ఏలూరు రూరల్: ఏలూరు నగరంలో 24వ డివిజన్ ప్రజలు డ్రెయినేజీ నిర్మించాలని వేడుకుంటున్నారు. ఏలూరు నగర కార్పొరేషన్ పరిధి 24వ డివిజన్ జేవియర్‌నగర్ ఏళ్లుగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ఇళ్లల్లో వాడుక నీరు లోతట్టు ప్రాంతాల్లో చేరి మురుగుకూపాలుగా మారుతున్నాయని వాపోతున్నారు. దోమలు, పందులతో సహవాసం చేయాల్సి దుస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మౌలిక వసతులు అభివృద్ధి చేయకపోయినప్పటికీ క్రమం తప్పకుండా ఇంటి పన్ను, కుళాయి పన్ను వసూలు చేస్తున్నారని వివరించారు. ఎన్నికల సమయంలో స్థానిక నాయకులు వచ్చి మీ సమస్య పరిష్కరిస్తాం అంటూ వాగ్దానాలు చేస్తున్నా, ఎన్నికల తర్వాత సమస్య పరిష్కరించమని వేడుకున్నా కనీసం కనెత్తి చూడడం లేదని వాపోతున్నారు.

నివాసాల మధ్య మురుగు

స్థానిక రెడ్డమ్మ స్ట్రీట్‌లో 1, 2 రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. ఈ ప్రాంతంలో సుమారు 40కు పైగా భవనాలు, ఇళ్లు ఉన్నాయి. ఈ భవనాల్లో వాడుక నీరు బయటకు పోయే దారి లేకపోవడంతో లోతట్టు స్థలాల్లో చేరుతోంది. దీంతో పందులు సంచారం పెరిగి, పరిసరాలు దుర్గంధం వెదజల్లుతుంది. దీనికి తోడు దోమలు సైతం వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా స్థానికులు దోమలతో వేగలేక చీకటిపడగానే కిటికీలు, తలుపులు మూసుకుంటున్నారు. అయినప్పటికీ దోమల బెడదతో పిల్లలు, వృద్ధులు జ్వరాల బారిన పడుతున్నారని మహిళలు వాపోతున్నారు. వర్షాకాలంలో వీరి బాధలు రెట్టింపు అవుతున్నాయి. మురుగునీటితో పాటు వర్షం నీరు సైతం ఖాళీస్థలాల్లో చేరి పరిసరాలను మరింత అధ్వానంగా మారుతున్నాయి. వర్షాకాలంలో మురికికూపాలు మారుతున్న స్థలాలు వేసవి కాలం వరకూ సమస్యలు సృష్టిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ఫిర్యాదులు బుట్టదాఖలు

డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చేయకపోవడం వల్ల ప్రజలు పడుతున్న అవస్థలను వివరిస్తూ స్థానికుడు ఎం.సూర్యచంద్రరావు కొద్దికాలం క్రితం జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు సైతం బుట్టదాఖలయ్యింది. కార్పొరేషన్ అధికారులు ఫిర్యాదుపై కనీసం స్పందించలేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రెయినేజీ అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

డ్రెయినేజీని అభివృద్ధి చేయాలి



ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద భవనాలు ఉన్నాయి. కానీ అధికారులు డ్రైయినేజీ అభివృద్ధి చేయలేదు. కనీసం ప్రధాన డ్రెయినేజీ అభివృద్ధి చేసిన చాలు. ఇళ్ల ముందు డ్రెయినేజీ నివాసితులు కట్టుకుంటారు. అధికారులు నిర్లక్ష్యం వల్ల మా ఇంటి మధ్య ఖాళీస్థలం మురికికూపంగా మారిపోయింది. దీని కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా మారిపోతున్నాయి.

– ఎం.జ్యోతిప్రసాద్

పందులు పెరిగిపోయాయి



ఖాళీస్థలాల్లో మురుగునీరు చేరడం వల్ల పందులు పెరిగిపోయాయి. రాత్రి, పగలు ఇళ్ల మధ్య ఉంటున్నాయి. కొన్ని నెలల క్రితం ఒకటి లేదా రెండు పందులు ఉండేవి. ఇప్పుడు ఏకంగా పదుల సంఖ్యలో పందులు వస్తున్నాయి. వీటివల్ల ఒక్కటే దర్వాసన. పందుల కారణంగా ఇంటిలో కూడా ఉండలేకపోతున్నాం.

– ఎం.సాయిదుర్గ

దోమల బాధ పడలేకపోతున్నాం



మురికికూపం కారణంగా ఈ ఏరియాలో దోమలు పెరిగిపోతున్నాయి. దోమల బాధ పడలేక చీకటి పడగానే ఇంట్లోకి వెళ్లిపోతున్నాం. దోమల కుట్టడం వల్ల పిల్లలు జ్వరాలు బారిన పడుతున్నారు. హాస్పటల్ వెళితే వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. అధికారులు ఈ ప్రాంతాల్లో డ్రెయినేజీ అభివృద్ధి చేస్తే, మురుగు ఇళ్ల మధ్య ఉండకుండా బయటకు పోతుంది.

– ఎం.గౌరీ

పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి



మురుగునీరు నిలిచిపోవడం వల్ల ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వీటి కారణంగా విష పురుగులు, పాములు పెరుగుతున్నాయి. కొన్నిసార్లు ఇళ్లలోకి వస్తున్నాయి. పిల్లలను కుడుతున్నాయి. రెండుసార్లు పాములు వచ్చాయి. కుక్కలు పామును చూసి అరిచాయి. లేదంటే పిల్లలను కాటేసేవి. అధికారులు ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల సమస్య పరిష్కరించాలి.

– జి.గణపతి

ఎంఆర్‌సీ కాలనీలో విజిలెన్స్ దాడులు



చౌకడిపోను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఏలూరు(మెట్రో): పట్టణంలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్, పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఎంఆర్‌సీ కాలనీలో చౌకడిపో 38ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి మాట్లాడుతూ ఈ తనిఖీల్లో షాపు నెంబర్ 0581038లో బియ్యం, పంచదార, కందిపప్పు నిల్వల్లో వ్యత్యాసాలు గుర్తించామన్నారు. దీంతో డీలర్‌పై, ఆమె భర్తపైన నిత్యావసరాల వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ ఏఓ జి.మీరయ్య, ఎస్సై కె.సీతారాము, ఆర్‌ఐ జె.శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జంగారెడ్డిగూడెంలో రవన్న వర్ధంతి

ఏలూరు (టూటౌన్): సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ రవన్న తొమ్మిదో వర్ధంతిని ఆదివారం జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్నట్లు నాయకలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ ఆవరణలో వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యర్రా శ్రీనివాస రావు, నాయకులు మీసాల రమణ, ఎం రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యం



ఏలూరు(మెట్రో): కలెక్టర్ వెట్రిసెల్విని మెమెంటోతో సత్కరిస్తున్న మహిళా ఉద్యోగులు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జేసీ ధాత్రి రెడ్డిని సన్మానిస్తున్న సీఆర్‌ఆర్ విద్యా సంస్థల కమిటీ ప్రతినిధులు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళా ఉద్యోగులను అవార్డులతో సత్కరిస్తున్న విద్యుత్ సంస్థ అధికారులు

ఏలూరు(మెట్రో): మహిళాభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లాపరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం రాత్రి ఏపీ ఎన్జీవోస్ ఏలూరు జిల్లా విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యతోనే ప్రగతి సాధ్యమన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి, ఐసీడీఎస్ పీడీ పి.శారద, ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు వెంకట రామారావు పాల్గొన్నారు. జిల్లా ఖజానా కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఖజానా అధికారి టి.కృష్ణ మాట్లాడుతూ స్త్రీ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఖజానా ఉద్యోగుల కార్యదర్శి కప్పల సత్యనారాయణ, సహాయ ఖజానా అధికారి పి.ప్రేమవతి, ఉప ఖజానా అధికారి టి.భారతి, ఏలూరు సబ్ ట్రెజరీ అధికారి స్వరాజ్యమణి పాల్గొన్నారు.

మహిళలు లక్ష్యాలను సాధించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళలు తమ లక్ష్యాలు సాధించేందుకు ధైర్యంగా ముందుకు సాగినప్పుడే వారికి విజయాలు సొంతమవుతాయని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి సూచించారు. స్థానిక సీఆర్ రెడ్డి కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ధాత్రి రెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాల్లో విజయాన్ని సాధించిన మహిళల ప్రతిభను కొనియాడారు. అనంతరం సీఆర్ రెడ్డి విద్యా సంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో జేసీ ధాత్రిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు పాల్గొన్నారు. స్థానిక ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వనమా రాఘవేంద్ర రావు మహిళా సిబ్బందిని సత్కరించారు. సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో రిటైర్డ్ ప్రొఫెసర్ డి.సరస్వతి మహిళల సేవలను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.సరళ, ఐక్యూసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు. కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించి సిబ్బందిని సత్కరించారు. వైస్ ప్రిన్సిపల్ ఎం. రాంబాబు, పీఆర్ కావ్య శ్రీ పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి గీటురాయి మహిళాభివృద్ధే

దేశాభివృద్ధికి మహిళాభివృద్ధి గీటురాయి లాంటిదని ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్ రాజు అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాల్మన్ రాజు ఏలూరు విద్యుత్ సర్కిల్ పరిధిలో విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ చూపిన అన్ని స్థాయిల్లోని 34 మంది మహిళా ఉద్యోగులకు ఉత్తమ ఉద్యోగి అవార్డును ప్రదానం చేశారు. కేఎం అంబేడ్కర్, పీర్ అహ్మద్ ఖాన్, టి. శశిధర్, పి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘ నాయకులపై కేసు కొట్టివేత



కోర్టు బయట సంతోషం వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): కళాశాల యాజమాన్యం విద్యార్థి సంఘ నాయకులపై పెట్టిన అక్రమ కేసును ఏలూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు కొట్టేసింది. వివరాల ప్రకారం 2024 నవంబర్ నెలలో సర్టిఫికెట్లు ఇవ్వలేదన్న కారణంతో చేబోయిన అచ్యుత్ అనే విద్యార్థి ఎస్‌వీఆర్‌కేకళాశాలలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆ సందర్భంలో విద్యార్థికి న్యాయం చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ, వైఎస్సార్‌ఎస్‌యూ విద్యార్థి సంఘాలు కళాశాల వద్ద ఆందోళనకు దిగాయి. దీంతో కళాశాల యాజమాన్యం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఏలూరు అసెంబ్లీ కన్వీనర్ వైవీ శివరావు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, ఎం. క్రాంతిపై కేసు పెట్టింది. అయితే ఆరోపణలు రుజువు కాకపోవడంతో ఏలూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు కేసు కొట్టేసింది.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	36	బీళ్ల చిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	34	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	26	కంద	72
కాకర కాయలు	36	బీట్‌రూట్	30
బీరకాయలు (పందిరి)	48	కీరా దోస	40
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	60
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10-12
గోరుచిక్కుడు	44	గోంగూర	07-10
దోసకాయలు	30	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	23
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	09
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.0	4830	31

ప్రజా సమస్యలపై సీపీఎం ప్రజాచైతన్య యాత్రలు



సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం నుంచి 17 వరకూ రాష్ట్రవ్యాప్తంగా సమస్యలపై అధ్యయనం, 16 నుండి 23 వరకూ ప్రజాచైతన్య యాత్రలు, 24 నుంచి 29 వరకూ ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం చెప్పారు. శుక్రవారం ఏలూరు ఉద్ద రాజు రామం భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మొడియం నాగమణి అధ్యక్షతన పార్టీ జిల్లాస్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంతెన సీతారాం మాట్లాడుతూ సూపర్ 6 వాగ్దానాల్లో ముఖ్యమైన ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించాలని, ఉగాది నాటికి యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1,500 అమలును ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఆందోళనలో ఉన్నారని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు, నివాసముంటున్న లక్షలాది పేదలకు పట్టాలివ్వాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్, తెల్లం రామకృష్ణ, జి.రాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఏలూరు టౌన్: నగరంలోని భగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తిని ఎదురుగా ఇంట్లో నివసించే మరో వ్యక్తి వేధింపులకు గురి చేయడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల ప్రకారం భగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన బుడుమూరి గోపాలకృష్ణ అలియాస్ గోపి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. ఎదురింట్లో నివాసం ఉంటున్న ఓ హోంగార్డు గత కొంతకాలం క్రితం ఒక బాలుడిని దత్తత తీసుకుంది. బాలుడిని చిత్రహింసలకు గురి చేయడంతో గోపి హోంగార్డును ప్రశ్నించాడు. బాలుడిని ఎందుకు వేధిస్తున్నారంటూ నిలదీశాడు. ఇరువర్గాల మధ్య ఈ విషయంలో వివాదం చెలరేగింది. ఈ గొడవ కాస్తా పోలీస్ స్టేషన్‌కు చేరింది. పోలీసులు గొడవను సర్దుబాటు చేసి ఇరువురికి నచ్చజెప్పి పంపించేశారు. కానీ హోంగార్డు గోపిను మానసికంగా వేధింపులకు గురిచేస్తూ ఉండడంతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు గోపిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాధితుడి వాంగ్మూలంతో ఎమ్మెల్సీ నమోదు చేశారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సారె తీసుకువస్తున్న మహిళా భక్తబృందం సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 12 పంపుల సెంటర్‌లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి మహిళా భక్త బృంద సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అమ్మవారికి మహిళా భక్తులు సారె సమర్పించారు. ప్రధాన అర్చకులు ఆలయానికి విచ్చేసిన భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర శత నామ పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.